

ఆనందంలో ఆయిల్‌పామ్ రైతు
» టన్ను రూ.19,660 » నిలకడగా ధర
» సాగుపై ఆసక్తి చూపిస్తున్న రైతులు 7

కాకినాడలో అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీలు ప్రారంభం 7

'స్క్రబ్ టైఫస్' వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

» ఇది నల్లుల ద్వారా సంక్రమిస్తుంది
» నల్లమచ్చలు, దద్దుర్లు వస్తే పీహెచ్‌సీల్లో సంప్రదించాలి: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లి ద్వారా సంక్రమించే స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్క్రబ్ టైఫస్ అనేది ఓరెన్షియా షుషుగముషి అనే బ్యాక్టీరియా వల్ల ప్రబలుతుందన్నారు. ఇది ఒక రకమైన జ్వరమని, ఇది సాధారణంగా తుప్ప లు, పొదలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కనిపిస్తుందని అన్నారు. నల్లి కరిచినప్పుడు, కరిచిన ప్రదేశంలో నల్లని మచ్చ, దద్దుర్లు ఏర్పడతాయని, వాటిని ఎస్కార్ అంటారని తెలిపారు. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, దద్దుర్లు, వాపు వంటి లక్షణాలు ఈ వ్యాధిలో బహిర్గతమవుతాయన్నారు. సరైన సమయంలో చికిత్స అందించకపోతే ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందన్నారు. స్క్రబ్ టైఫస్‌ను గుర్తించేందుకు.పలు రక్త పరీక్షలతోపాటు కొన్ని రకాల వైద్య పరీక్షలు అవసరమన్నారు. దీనికి యాంటీ బయోటిక్స్ ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు ఈ వ్యాధిపట్ల అవగాహన కల్పించామన్నారు. ఇది మైట్స్(నల్లుల) లార్వా కాటు ద్వారా మనుషులకు వ్యాపిస్తుందన్నారు. అందువల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చాలా అవసరమన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో చికిత్స అందుబాటులో ఉందన్నారు.

న్యూమోనియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి):న్యూమోనియా జ్వరాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అది ప్రాణాంతకమై తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని డీఎంహెచ్‌వో డాక్టర్ జె. నరసింహనాయక్ హెచ్చరించారు. డీఎంహెచ్‌వో చాంబర్‌లో శుక్రవారం ఆయన న్యూమోనియా నియంత్రణకు సంబంధించిన అవగాహన కోసం సిబ్బందితో కలిసి గోడ పత్రికలు, కరపత్రాలు, బ్యానర్లు ఆవిష్కరించారు. వీటిపై ప్రజల్లో అవగాహనకోసం జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో పంపిణీ చేయడం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 12 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలు,ఆశాలు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, డాక్టర్లు న్యూమోనియా వ్యాధిని శిశువుల్లో త్వరగా గుర్తించి చికిత్స అందజేయడం ద్వారా ఐదేళ్లలోపు పిల్లల మరణాలు నివారించవచ్చన్నారు. వ్యాధి నిరోధక టీకాలు ప్రణాళిక ప్రకారం వేయించాలని సూచించారు. పీవీసీ టీకాలు రెండు మోతాదులు 6 వారాలు, 14 వారాల్లో.. 9 నెలలకు బూస్టర్ డోస్ వేయించాలని సూచించారు. పిల్లల్లో న్యూమోనియా రావడానికి కారణాలు ఎక్కువ సమయం పొగకు గురికావడం, వాతావరణంలో మార్పులు, నిర్ణీతసమయంలో టీకాలు వేయించకపోవడం, పౌష్టికాహారం సరిగా ఇవ్వకపోవడం, బిడ్డకు సరైన వెచ్చదనం కలిగించకపోవడం ప్రధాన కారణాలన్నారు. జలుబు, దగ్గు త్వరగా శ్వాసతీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో పక్కలు ఎగురవేయడం, అధిక జ్వరం, తల్లిపాలు, ఆహా రం తీసుకోకపోవడం, దడ, నిద్రమత్తు,ఛాతి అతిగా కొట్టుకోవడం వంటి లక్షణాలుంటాయన్నారు. డీఎంవో డాక్టర్ ప్రభాకర్, ఎపిడమాలజిస్ట్ ప్రత్యూష, ఎస్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



టిడ్కో
డబ్బులిస్తారా!
పేదింట తీరని కలత

లక్ష కట్టండి.. సొంతింట్లో దిగండి.. ఇదీ గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన భరోసా.. చాలా మంది పేదలు అప్పులు చేసి మరి రూ.లక్ష చొప్పున కట్టారు. అయితే 2019లో టీడీపీ ఓటమిపాలవడంతో టిడ్కో ఇళ్లు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో పలువురికి ఇళ్లను రద్దు చేసేసింది. అయితే ముందు చెల్లించాల్సిన రూ.లక్ష మాత్రం ఏ ఒక్కరికీ చెల్లించలేదు. గత ఐదేళ్లుగా సొమ్ము వెనక్కు రాక ఈసురోమంటున్నారు. అప్పులు చేసి కట్టిన డబ్బులు ఇవ్వకుండా ఎన్నాళ్లు ఏడిపిస్తారం టూ కలెక్టరేట్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో తమకు ఇన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ప్రస్తుత ప్రభుత్వమైనా కరుణించాలంటూ గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తులు చేస్తున్నారు. అయినా డబ్బుల సంగతి తేలకపోవడంతో అయోమయంలో ఉన్నారు.

- (కాకినాడ, ఆంధ్రజ్యోతి)

» వైసీపీలో టిడ్కో నిధులు మళ్లింపు
» ఇళ్లు రద్దు చేసినా చెల్లింపుల్లేవ్
» ఐదేళ్లగా లబ్ధిదారుల ఎదురుచూపులు
» అయోమయంలో రూ.10.52 కోట్లు
» ఎంపీ, ఎమ్మెల్యేలకు విన్నపాలు
» అయినా ఫలించని వైనం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టిడ్కో ఇళ్లు రద్దయిన వారి డబ్బులు రూ.10.20 కోట్ల మేర పేరుకుపోయాయి. ఆ రిఫండ్ డబ్బులు వస్తాయో రావో అన్నట్టుగా పరిస్థితి మారింది. నిధుల విడుదలకు ఆయా మునిసిపాలిటీల వారీగా ఎమ్మెల్యేలు సైతం ప్రయత్నం చేస్తున్నా అమరావతిలో టిడ్కో ఉన్న తాధికారులు మాత్రం ఉలుకు పలుకు లేకుండా ఉన్నారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు, రామచంద్రపురం రూ.1.20 కోట్లు, పెద్దాపురం రూ.59.28 లక్షలు, మండపేట రూ.42 లక్షలు, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లో 21 లక్షల చొప్పున రిఫండ్ డబ్బులు పేరుకుపోయాయి.

టీడీపీ ఇస్తే..వైసీపీ వచ్చి లాగేసుకుంది..

2014లో అధికారంలోకి వచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణాలు, నగరాల్లో నివసించే పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2017-2019 మధ్య లబ్ధిదారులను ఎంపిక చేసింది. టిడ్కో ఇళ్ల కోసం ఆయా మునిసిపాలిటీలకు లబ్ధిదారుడి వాటాగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25వేల చొప్పున చెల్లించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లపై కత్తి కట్టింది. పేదలకు ఇవ్వకుండా నిలిపివేసింది. వేలాది మందికి మంజూరైన టిడ్కో ఇళ్లను రద్దు చేసేసింది. ఈ మేరకు లబ్ధిదారులకు అంతకు ముందు వారు చెల్లించిన మొత్తాన్ని వెనక్కు ఇవ్వాల్సి ఉంది. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ డబ్బులను అప్పటికే మునిసిపాలిటీల నుంచి టిడ్కోలో ప్రత్యేక ఖాతాకు మళ్లించేసి వాడేసుకుంది. దీంతో లబ్ధిదారులు ఎంత మొత్తు కున్నా వారి డబ్బులను వెనక్కివ్వలేదు. చివరకు ఇప్పటికి ఐదేళ్లవుతున్నా ఏ ఒక్కరికీ డబ్బులు రిఫండ్ రాక వారంతా లబోదిబోమంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.10.20 కోట్ల వరకు ఈ సొమ్ములు పేరుకుపోయాయి.

ఎక్కడెక్కడ ఎంత ఇవ్వాలంటే..

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు రిఫండ్ డబ్బులు వెనక్కు రాక లబ్ధిదారులు నెత్తీ నోరు బాదుకుంటున్నారు. రూ.లక్ష చొప్పున 589 మందికి, రూ.25 వేల చొప్పున 150 మందికి, రూ.50 వేల చొప్పున 448 మందికి డబ్బులు రాలేదు. అప్పట్లో కార్పొరేషన్ పరిధిలో 2,056 టిడ్కో ఇళ్లు నిర్మించారు. సైట్-ఏలో 1,152 ఇళ్లు, సైట్-బీలో 904 ఇళ్లు నిర్మించారు. వీటికి సంబంధించి ఇళ్లు మంజూరై ఆనక రద్దయిన, రద్దు చేసుకున్న లబ్ధిదారులకు రూ.6.53 కోట్లు వెనక్కు రాలేదు. సామర్లకోట మునిసిపాలిటీ పరిధిలో 1,056 ఇళ్లు నిర్మించగా వీటిలో రద్దు చేసుకున్న వారికి రూ.25 లక్షలు వెనక్కు రావాల్సి ఉంది. ఇందులో రూ.లక్ష చొప్పున 33 మందికి రావాల్సి ఉంది. పెద్దాపురం మునిసిపాలిటీలో 3,312 ఇళ్లు నిర్మించగా రద్దు చేసుకున్న వారికి రూ.59.28 లక్షలు ఐదేళ్ల నుంచీ వెనక్కు రావడం లేదు. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారు 55 మంది, రూ.50 వేల చొప్పున చెల్లించిన వారు 106 మంది ఉన్నారు. పిఠాపురంలో 864 టిడ్కో ఇళ్లు నిర్మించగా రూ.10 లక్షలు ఇంకా వెనక్కు రాలేదు. రామచంద్రపురం మునిసిపాలిటీలో లబ్ధిదారులకు రూ.1.20 కోట్లు రావాల్సి ఉంది. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారు 92 మంది ఉన్నారు. మండపేట మునిసిపాలిటీలో రూ.42 లక్షలు, అమలాపురం మునిసిపాలిటీ రూ.40 లక్షలు రావాల్సి ఉంది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీల పరిధిలో రూ.21 లక్షల వరకు రావాల్సి ఉంది.

వస్తాయా.. రావా..

లబ్ధిదారులకు వెనక్కు ఇవ్వాల్సిన డబ్బులను అప్పటి వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వాడేసుకుంది. దీంతో రిఫండ్ డబ్బులు ఎవరికీ రాలేదు. ప్రభుత్వం మారిన తర్వాత అనేక మంది బాధితులు ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చి కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు సైతం లబ్ధిదారులు తిరుగుతున్నా పనవడం లేదు. ఈ నిధులు లబ్ధిదారులకు వెనక్కివ్వాలని కలెక్టర్లు,ఎమ్మెల్యేలు సైతం టిడ్కోకు లేఖలు రాసినా ఎలాంటి ప్రయోజనం లేదు. తమ వద్ద ఆ నిధులు లేవని అక్కడి అధికారులు సమాధానం చెబుతున్నారు. దీంతో రిఫండ్ డబ్బులపై అయోమయం నెలకొంది. ఇటీవల కాకినాడకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ దృష్టికి అధికారులు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం దృష్టికి మరోసారి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.

గుట్టు రట్టే

» సముద్రంలో ఫార్మా వ్యర్థ జలాల కాలుష్యంపై మరింత నిఘా
» మత్స్యకారులకు పవన్ హామీ నేపథ్యంలో పీసీబీ కసరత్తు
» అరబిందో, దివిస్ కంపెనీల ఎదుట కాలుష్యంపై డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు
» సముద్రంలోకి వదిలే ముందు ఫార్మా వ్యర్థ జలాల వీడియో చిత్రీకరణకు నిర్ణయం
» కీలక ప్రతిపాదనలకు కాలుష్య నియంత్రణ బోర్డు ఆమోదముద్ర



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

అరబిందో, దివిస్ ఫార్మా వ్యర్థజలాలతో సముద్ర జలాలు కాలుష్యమవుతున్నాయన్న ఆందోళన నేపథ్యంలో పీసీబీ అప్రమత్తమైంది. విషతుల్య ఫార్మా వ్యర్థ జలాలు సముద్రంలో కలవకుండా చేయడంతోపాటు వీటిపై పర్యవేక్షణ మరింత పెంచాలని నిర్ణయించింది. ఫార్మా కంపెనీల వల్ల తమకు సముద్రంలో వేట దొరకడం లేదన్న మత్స్యకారుల ఆందోళనల నేపథ్యంలో సమస్య పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వందరోజులు గడువు కోరిన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు ఈ దిశగా కసరత్తు వేగం పెంచారు. అందులో భాగంగా ఇకపై ప్రజలందరికీ తెలిసేలా ఈ రెండు కంపెనీల ఎదుట డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయబోతున్నారు. తద్వారా ఫార్మా కంపెనీల్లో ఉత్పత్తయ్యే కాలుష్యం ఎంతనేది ప్రజలందరికీ తెలిసేలా చేయనున్నారు. సముద్రంలోకి ఫార్మా వ్యర్థ జలాలను విడుదల చేసే ముందు వాటిని క్రమం తప్పకుండా వీడియో చిత్రీకరణ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇటీవల ఈ రెండు కంపెనీలను పరిశీలించిన నిపుణుల బృందం సిఫార్సుల మేరకు పీసీబీ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.

వ్యర్థ జలాలపై మరింత నిఘా..

పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం పరిధిలోని తీర ప్రాంత మత్స్యకారులు కొంతకాలంగా సముద్రంలో కలుస్తోన్న ఫార్మా వ్యర్థజలాలతో ఇబ్బందులు పడుతున్నారు. సముద్రంలో వేటకు వెళ్లినా మత్స్య సంపద చిక్కడం లేదని, ఫార్మా వ్యర్థ జలాల కారణంగా మత్స్య సంపద చనిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో సమస్య పరిష్కరించాలంటూ రోడ్డెక్కారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్వయంగా వచ్చి తమ బాధ ఆలకించాలని డిమాండ్ చేశారు. దీంతో అక్టోబరులో ఆయన ఉప్పాడలో బహిరంగసభలో ప్రసంగించారు. మత్స్యకారులకు న్యాయం చేస్తానని హామీఇచ్చారు. ఫార్మా వ్యర్థజలాలు సముద్రంలో కలిసే విషయమై సమస్య పరిష్కారానికి తనకు వంద రోజులు గడువు కావాలని కోరారు. పవన్ హామీ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు ఈ సమస్య పరిష్కారంపై రంగంలోకి దిగారు. సముద్రజలాలు ఏస్థాయిలో కలుషితమవుతున్నాయో తేల్చడానికి నీరి, నియో, ఏయూలో నిపుణులతో సంప్రదింపులు జరిపారు. వ్యర్థజలాలు సముద్రంలో కలవకుండా ఏంచేయాలనే దానిపై సమాలోచనలు జరిపారు.సముద్రంలో వ్యర్థజలాలను విడుదలచేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలంకుషంగా చర్చించారు. అరబిందో, దివిస్ కంపెనీలు చేపడుతున్న ఫార్మా ఉత్పత్తులను ఇటీవల పరిశీలించారు. అనంతరం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని కాలుష్య నియంత్రణ బోర్డు సైతం తాజాగా ఆమోదించింది. దీని ప్రకారం ఈరెండు ఫార్మా కంపెనీలు చేపడుతున్న ఉత్పత్తి ప్రకారం రోజూ ఏస్థాయిలో వ్యర్థ జలాల కాలుష్యం ఉత్పత్తి అవుతుందనేది ప్రజలకు తెలిసేలా చేయాలనినిర్ణయించారు. అందుకోసం కంపెనీల ఎదుట డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పరిశీలించిన తర్వాతే..

ప్రస్తుతం కాకినాడ సెజ్ పరిధిలో తొండంగి మండలంలో అరబిందో సంస్థ లైఫియస్ ఫార్మా కంపెనీ రూ.2,500కోట్ల పెట్టుబడితో ఏటా 15వేల మెట్రిక్ టన్నుల పెన్సిలిన్, 1.80లక్షల మెట్రిక్ టన్నుల గ్లూకోజ్ ఉత్పత్తి చేసే సామర్థ్యంతో కంపెనీ స్థాపిం చింది. ప్రస్తుతం ఏడాదికి 15శాతం మాత్రమే ఉత్పత్తి చేస్తోంది. ఈక్రమంలో విడుదలయ్యే ఫార్మావ్యర్థ జలాలను సముద్రంలోకి విడిచి పెడుతోంది. ఇందుకోసం 11మీటర్ల అడుగులో సముద్రంలో పైపులైన్‌ను 2.3కిలో మీటర్ల మేర నిర్మించింది. అక్కడ ఈ వ్యర్థజలాలను సముద్రంలో కలుపుతోంది. దివిస్ తొండంగిలో రూ.1,200కోట్లతో ఫార్మా కంపెనీ నిర్మించింది. ఈసంస్థ కూడా ఫార్మా ఉత్పత్తుల ద్వారా వెలువడి వ్యర్థజలాలను 1.3కిలోమీటర్ల మేర సముద్రంలో పైపులైన్ నిర్మించి వదులుతోంది. ఈ రెండు కంపెనీలు రోజు వారీ ఉత్పత్తిలో భాగంగా ఏయే రకాల కాలుష్యం.. ఏ స్థాయిలో వెదజల్లుతున్నాయి? వ్యర్థ జలాల కాలుష్యం పరిమాణం ఎంత? అసలు ఎంత ఉండాలి? అందులో వచ్చే విష రసాయనాలు ఏంటి? వాటి పరిమాణం ఎంత? అసలు ఎంత ఉండాలి? వంటి సమస్త వివరాలను ఈ డిజిటల్ డిస్‌ప్లే బోర్డులో తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఫార్మావ్యర్థ జలాలను సముద్రంలో వదిలేముందు విశాఖనుంచి వచ్చే నిపుణులు పరిశీలించి ఆ తర్వాతే సముద్రంలో కలిపేందుకు అనుమతిస్తారు. అనుమతికి మించిన విష వ్యర్థాలు ఉంటే మరోసారి శుద్ధిచేస్తేగానీ సముద్రంలో కలపడానికి అనుమతించరు. ఇదంతా రహస్యంగానే జరుగుతుంది. కంపెనీలు విష జలాలను సముద్రంలో కలపడంవల్ల వేట జరగడం లేదని ఆరోపణల నేపథ్యంలో ఇకపై పైపులైన్ల ద్వారా వదిలే విషవ్యర్థ జలాలను వీడియోలో చిత్రీకరించాలని నిర్ణయించారు. తద్వారా విషజలాల గురించి మత్స్యకారులకు అవగాహన తీసుకొచ్చి కంపెనీలపై మరింత నిఘా పెంచినట్లవుతుందని పీసీబీ భావిస్తోంది.

విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచి వచ్చిన ప్రతి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. ఈనెల 26న అమరావతిలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో జిల్లానుంచి ప్రాతినిధ్యం వహించిన 8మంది విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే పిల్లలకు నాణ్యమైన విద్య, ఇతర నైపుణ్యాలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు.అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో జిల్లాలో విద్యార్థులు పాల్గొనడం శుభపరిణామమన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్, ఇతర మంత్రులను స్వయంగా కలుసుకోవడం ఎంతో సంతోషం కల్గిందన్నారు. ఒక బిల్లు సభలో ప్రవేశపెట్టిన దగ్గరనుంచి గవర్నర్ ఆమోదం పొందే వరకు ఉన్న ఆయా దశలను తెలుసుకోవడంవల్ల అవగాహన కల్గిందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు స్వాతి(స్పీకర్, ప్రత్తిపాడు నియోజకవర్గం), సత్యవెంకట్(తుని ఎమ్మెల్యేగా), బి.మానస (పిఠాపురం ఎమ్మెల్యేగా), ఐ.అవినాశ్(కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా), శివరాజేశ్(పెద్దాపురం ఎమ్మెల్యేగా), జాహ్నవి (కాకినాడ అర్బన్ ఎమ్మెల్యేగా), సత్యరామాంజనేయులు (జగ్గంపేట ఎమ్మెల్యేగా) పాల్గొన్నారు.

» మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులతో కలెక్టర్



మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులతో కలెక్టర్ షాన్‌మోహన్

సబ్‌ప్లాన్ గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించాలనే పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

ప్రత్తిపాడు,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 40సబ్‌ప్లాన్ గిరిజనగ్రామాలు షెడ్యూల్ గిరిజన గ్రామాలుగా గుర్తించాలనే పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారించింది. ప్రత్తిపాడు మండలంలోని 14, రౌతులపూడి మండలంలోని 11, శంఖవరం మండలంలోని 15 సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆదివాసీ మహాసభ కాకినాడ జిల్లా కార్యదర్శి జర్తా రమణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరిగింది. దీనిపై తీసుకున్న చర్యలు ఏంటని హైకోర్టు ప్రశ్నించగా కోర్టుకు వారం రోజుల్లో తెలియజేస్తామని ప్రభుత్వ తరుపు న్యాయవాదులు హైకోర్టులో తెలిపారని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారుడు, హైకోర్టు న్యాయవాది అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. ఇదే సమస్యపై గతంలో మూడు సంఘాలు హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశాయి. నాలుగు మండలాల్లోని 40 గ్రామాల సమస్యను పరిష్కరించాలని షెడ్యూల్ ఏరియాలో కలపాలని ఫిర్యాదుదారులు ఆ కొటేషన్‌లో కోరారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో మళ్లీ ఆదివాసీ మహాసభ ఈ సమస్యపై హైకోర్టును ఆశ్రయించిందని హైకోర్టు న్యాయవాది అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు.

వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల కింద జిల్లాలో నిర్వహిస్తున్న వసతిగృహాల నిర్వహణ, వసతిగృహాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, అవసరమైన సదుపాయాలు, అధికారులు నిర్వహించిన తనిఖీల వివరాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ వసతిగృహాల సక్రమ నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. చిన్న చిన్న పొరపాట్లకు ఇతర అవకతవకలకు ఎటువంటి ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ గృహాల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. ఈ యాప్ నిర్వహణపై వసతిగృహాల అధికారులు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు తమ పరిధిలో వసతిగృహాలను తప్పనిసరిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 15 రోజులకు ఒకసారి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో అన్ని వసతిగృహాల్లో ఆర్‌వో ప్లాంట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వసతిగృహాల్లోని పనులపై ప్రతినెల ఒక ప్రత్యేక అంశంమీద దృష్టిసారించాలన్నారు. ప్రధానంగా బాలికల వసతి గృహాలనుంచి తీసుకెళ్లడానికి వచ్చే తల్లిదండ్రులు, గార్డియన్స్ ఫొటోలు ఒక ప్రత్యేక రిజిస్టర్‌లో అతికించి, వివరాలు ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. వసతిగృహాల్లో విద్యార్థులకు, లైంగిక విద్య, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై ప్రతి శనివారం రెండుగంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నా రు. లీకేజీ సమస్యలు ఉన్న వసతిగృహాల వివరాలను నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, సాంఘిక సంక్షేమశాఖ జేడీ శోభారాణి, బీసీ సంక్షేమాధికారి లల్లి, గిరిజన సంక్షేమ అధికారి నాగమల్లేశ్వరరావు, డీపీవో రవికుమార్, ఏడీసీ సుధాకర్, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, సీపీవో త్రినాథ్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

2న జిల్లాలో.. డిప్యూటీ సీఎం పర్యటన

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లాలో పర్యటించే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో జిల్లా అధికారులు పర్యటన ఏర్పాట్లు చేస్తున్నారు. కాకినాడతోపాటు పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో పర్యటించే అవకాశాలు ఉన్నట్టు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని వారు తెలిపారు.

పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌కు సామర్లకోట మండలం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):కాకినాడ రెవెన్యూ డివిజన్‌లో ఉన్న సామర్లకోట మండలాన్ని పెద్దాపురంరెవెన్యూ డివిజన్‌కు బదిలీచేస్తూ గెజిట్ విడుదల చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని 30రోజులలోపు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా సమర్పించాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు 6లోపు ఫీజు చెల్లించాలి: డీఈవో

కాకినాడరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చే మార్చిలో పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా డిసెంబరు 6లోపు ఫీజు చెల్లించాలని డీఈవో రమేష్ తెలిపారు. రూ.50 ఆలస్య రుసుంతో 9వరకూ, రూ.200తో 12వరకూ, రూ.500తో డిసెంబరు 15 ఫీజు చెల్లించవచ్చన్నారు.



ఇంటర్మీడి 'హీట్'

- మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికలు
- ప్రభుత్వ కళాశాలల విద్యార్థులపై ఫోకస్
- సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- స్టడీ అవర్స్ నిర్వహణ

ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఇంటర్ బోర్డు అధికారులు అడుగులు వేస్తున్నారు. మెరుగైన ఫలితాల కోసం కార్యాచరణ సిద్ధం చేశారు. ఇంటర్‌బోర్డు సూచనలకు అనుగుణంగా 'సంకల్ప దీక్ష' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

– కాకినాడ, ఆంధ్రజ్యోతి

ఏ జిల్లా.. ఎన్ని కాలేజీలు...

కాకినాడ జిల్లాలో...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 14, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 3, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ కళాశాలలు 8, హైస్కూల్ ప్లస్‌లు 19, కేజీబీవీలు 4, మోడల్ స్కూల్స్ జూనియర్ స్కూల్స్ 2, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కళాశాలలు 99 ఉన్నాయి. వీటిలో ఫస్టియర్ విద్యార్థులు 22,574 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 21716 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో..

ఈ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 2, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలు 6, హైస్కూల్ ప్లస్‌లు 23, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలలు 82, ఒకేషనల్ కళాశాలలు 21 ఉన్నాయి. వీటిలో ప్రథమ సంవత్సరం 23,118 మంది, ద్వితీయ సంవత్సరం 23,145 మంది విద్యనభ్యసిస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13, ఏపీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలు 6, హైస్కూల్ ప్లస్‌లు 28, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలలు 88 ఉన్నాయి. 26,840 మంది విద్యార్థులు ఉన్నారు.

సిలబస్ పరిస్థితి ఏంటి..

డిసెంబర్ మొదటి వారం నాటికి అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో సిలబస్ పూర్తి అవుతుందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించే జిల్లాగా గుర్తింపు సాధించేలా అధ్యాపకుల సహకారంతో సమష్టిగా కృషి చేసేలా మూడు జిల్లా డీఐఈవోలు సంకల్ప దీక్షతో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు (ప్రథమ, ద్వితీయ)

- కాకినాడ జిల్లా : 42,834
- తూర్పుగోదావరి జిల్లా : 43,872
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా :25,650

గ్రేడ్‌లుగా విభజన..

ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక కసరత్తు!

ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఇప్పటికే అర్ధ సంవత్సర పరీక్షలు పూర్తయ్యాయి. వాటిలో వచ్చిన మార్కులను అంచనా వేసి విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఇంటర్ బోర్డు ఇచ్చిన ప్రశ్నాపత్రాలతో విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కులను ఎప్పటికప్పుడు ఇంటర్ బోర్డుకు పంపుతున్నారు. విద్యార్థులను గ్రేడులుగా విభజించి ఏ, బీ గ్రేడుల్లో ఉన్న వారు బాగా చదువుతున్నట్టు, సీ, డీ గ్రేడ్ విద్యార్థులు ఇంకా మెరుగుపడాల్సి ఉందని గుర్తించారు. ఈ నేపథ్యంలో వారికి ప్రత్యేక శిక్షణతోపాటు కొంతమంది అధ్యాపకులు వారిని దత్తత తీసుకుని స్టడీ అవర్స్ నిర్వహించి ప్రత్యేకంగా చదివించే సంకల్పంతో ఉన్నారు. వచ్చే ఏడాది జనవరి 21 నుంచి ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు ప్రారంభమవుతాయి. జనవరి 27 నుంచి ఫిబ్రవరి పదో తేదీ వరకు వృత్తి విద్య కోర్సులు అభ్యసించే వారికి ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి పదో తేదీ వరకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అనంతరం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఆకతాయిలకు చెక్..



- విద్యార్థినులపై వేధింపుల నివారణకు చర్యలు
- 'పోక్సో ఈ-బాక్స్ యాప్'ను ప్రవేశపెట్టిన కేంద్రం
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

విద్యార్థినులపై లైంగిక దాడులు, వేధింపులు, బెదిరింపుల సంఘటనలు ఇటీవలకాలంలో అధికంగా కనిపిస్తున్నాయి. కళాశాలకో, పాఠశాలకో వెళ్లేటప్పుడు వారి వెంటపడి వేధించే ఆకతాయిలు పెరిగారు. వీరి ప్రవర్తనతో ఎంతోమంది విద్యార్థినులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడం మానేస్తున్నారు. ఈ ఆకతాయిల చర్యలతో అటు తల్లిదండ్రులకు మానసిక ప్రశాంతత కరువవుతోంది. తమ కుమార్తె ఇంటికి క్షేమంగా చేరుతుందా?, లేదా? అనే ఆందోళన వెంటాడుతోంది. చాలా మంది బాధితులు సామాజిక, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో భయపడి ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. కొన్ని చోట్ల పోలీసులు ఇలాంటి ఆకతాయిల వికృత చేష్టలకు అడ్డుకట్ట వేసినా.. చాలా చోట్ల వీరు రెచ్చిపోతూనే ఉన్నారు. విద్యార్థినులను వేధిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలలకు వద్ద, బస్టాండుల్లో, ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లే సమయంలోనూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఆకతాయిల ఆగడాలు మరింత శ్రుతిమించుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం 'పోక్సో ఈ-బాక్స్ యాప్'ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో ఫిర్యాదు చేస్తే బాధితుల వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.

ఇలా ఫిర్యాదు చేయవచ్చు..

సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. పోక్సో ఈ బాక్స్ (పీఓసీఎస్‌ఓ ఈ బీఓఎక్స్) అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హోం పేజీలో ఎరుపు రంగు బటన్‌పై క్లిక్ చేయాలి. క్రీడా ప్రాంగణం, షాపు, రోడ్డు, స్కూలు, ట్యూషన్, బ్లాక్‌మెయిల్, స్కూల్ బస్, వ్యాన్, కుటుంబసభ్యులు, బంధువులు, ఇంటర్నెట్, సెల్‌ఫోన్ ఇలా రకరకాల చిత్రాలతో గుర్తులు కనిపిస్తాయి. బాధితులు తమ సమస్యలకు సంబంధించిన గుర్తుపై క్లిక్ చేసి పేరు, ఈ-మెయిల్, సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేయాలి. సంఘటన సమాచారాన్ని నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. ప్రతి ఫిర్యాదుకు రిఫరెన్స్ ఉంటుంది. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:///ఎన్‌సీపీసీఆర్.జీవోవీ.ఐఎన్/పీఓసీఎస్‌ఓ// ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్ నిర్వహణ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పరిధిలో ఉంటుంది.





మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాదుకలకు అభిషేకం, పాదగయ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో స్వయంభూ దత్తాత్రేయస్వామి

జై గురుదత్త

- పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం
- మహా సంస్థానంలో తొలిరోజు సర్వ పుష్ప పూజ
- వైభవంగా దత్తాత్రేయ స్వామి గ్రామోత్సవం

పిఠాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రాచుర్యం పొందిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణ వీధుల్లో దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. తొలి రోజు మహా గణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళ హారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, ఋత్విక్కులతో మూలమంత్ర అనుష్టానం, గణపతి అధర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాద పద్మాలకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకీసేవ, సాయంకాలార్చన నిర్వహించారు. సర్వ పుష్ప పూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పూజలో పాల్గొన్న భక్తులు

పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మహా గణపతి పూజ, కలశస్థాపనలు, ఋత్విక్ వరుణలు, పంచామృత సహిత రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, ఋత్వికులతో దత్తమాల మంత్ర అనుష్టానం, గురుచరిత్ర పారాయణ, వేదపారాయణ, గణపతి అధర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, విష్ణు, లలిత సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్తమూల మంత్ర హోమాదులు, సాయంకాల విశేష పుష్పార్చన, మంగళహారతి జరిగాయి. అనంతరం స్వయంభూ దత్తాత్రేయస్వామికి సహస్ర కలువలతో పుష్పార్చన నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జనవరి 24 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

పెద్దాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలను కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో జనవరి 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా తెలిపారు. నాటికల వివరాలు తెలిపే కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24న ప్రారంభ నాటికగా విజయవాడ వారి మమ్మల్ని బ్రతకనివ్వండి, రెండో ప్రదర్శనగా హైదరాబాద్ వారి గేమ్, మూడో ప్రదర్శనగా కొలకలూరు వారి జనరల్ బోగీలు, 25న విశాఖపట్నం వారి అసత్యం, రెండో ప్రదర్శనగా కాకినాడ వారి ఆచమనం, మూడో ప్రదర్శనగా చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం, 26న హైదరాబాద్ వారి అమ్మచెక్కిన బొమ్మ, రెండో ప్రదర్శనగా ఇది అతని సంతకం ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇందన బ్రహ్మానందం, కేదారి నాగు, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, వెన్న పండు, నూకలబంతి నానాజీ, కంటిబోయిన ప్రసాద్, ద్వారంపూడి చల్లారావు పాల్గొన్నారు.



← నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



మోక్షిత్ శ్రీసాయిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు 'శ్రీప్రకాష్' విద్యార్థి ఎంపిక

పెద్దాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న ఎస్.మోక్షిత్ శ్రీసాయి కాకినాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడని డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ నెల 29 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు గుంటూరు జిల్లా పేరిచర్లలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొంటాడు. విద్యార్థితో పాటు కోచ్ జి.దుర్గాప్రసాద్‌ను విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి, కల్చరల్ కో-ఆర్డినేటర్ ఉషాచైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

'పాడా' ఇన్‌చార్జి పీడీగా శ్రీనివాసరావు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రాంత ప్రాధికార అభివృద్ధి సంస్థ (పాడా) ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీనివాసరావును నియమించనున్నారు. ఇప్పటివరకు వున్న చైత్రవర్షిణిని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరు కార్యాలయంలో మైక్రో క్రెడిట్ విభాగం స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ బదిలీ చేశారు. దీంతో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.





ఖమ్మం జిల్లా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్న మల్లవరం గ్రామానికి చెందిన పురపతి.. శ్రీదేవి, స్రవంతిల పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రాలు ఖమ్మం జిల్లావి కాగా వీరి బిడ్డలవి అల్లూరి సీతారామరాజు జిల్లా ధ్రువీకరణ పత్రాలు



ఒడియా క్యాంపునకు చెందిన ఈ చిన్నారుల్లో సంతోష్ (అన్న)కు తూర్పు గోదావరి జిల్లా, సీతారం (తమ్ముడు)కు అల్లూరి సీతారామరాజు జిల్లా పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి.



వీరంతా చింతూరు ఏరియా ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న గర్భిణులు.. మరి కొద్దినెలల్లో వీరంతా పండంటి బిడ్డలకు జన్మనివ్వబోతున్నారు. కాగా పుట్టబోయే ఆ బిడ్డలంతా పోలవరం జిల్లా పేరిట ధ్రువీకరణ పత్రాలు పొందనున్నారు.

మళ్లీ మారనున్న చిరునామా!

- ఒకే ఊరు .. నాలుగు జిల్లాలు
- ఇది చింతూరు డివిజనుకే సొంతం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

ఆ ఇంటి పెద్దలకు ఖమ్మం జిల్లా పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలున్నాయి. ఇక 2014లో రాష్ట్ర విభజన తదుపరి ఆ ఇంట్లో పుట్టిన బిడ్డలకు తూర్పుగోదావరి జిల్లా పేరిట, 2022లో జిల్లాల పునర్విభజన తదుపరి పుట్టిన బిడ్డలకు అల్లూరి సీతారామరాజు జిల్లా పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలున్నాయి. తాజాగా పాలనా సౌలభ్యం కోసం మరోమారు చేపట్టిన జిల్లాల పునర్విభజన క్రమంలో అదే ఇంట్లో మరికొద్దిరోజుల్లో పుట్టబోయే బిడ్డకు పోలవరం (రంపచోడవరం) జిల్లా పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రం అందుకోనున్నారు. అంటే ఒకే ఇంట్లో మొత్తంగా నాలుగు జిల్లాల పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలు ఉండనున్నాయి. ఓటరు, ఆధార్, రేషన్‌కార్డుల చిరునామాలు కూడా ఇదే వరుసలో మారుతూ వస్తున్నాయి. ఈ తరహా మార్పులు చింతూరు డివిజనులో ఏ ఇంట చూసినా కానవస్తుంటాయి. అంటే పేరు, ఇల్లు, ఊరు మారకపోయినా జిల్లాలు మారుతూ వస్తున్నాయి. ఇదిలా ఉంటే ఒకే పాఠశాలలో లేదా అంగన్వాడీ కేంద్రాల్లోనూ తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల చిరునామాల పేరిట చదువుతున్న చిన్నారులున్నారు. ఇక వారికి పాఠాలు బోధించే ఉపాధ్యాయుల్లో పలువురికి ఖమ్మం జిల్లా పేరిట పుట్టిన స్థల ధ్రువీకరణ పత్రాలు ఉంటుంటాయి. ఈ మార్పులకు కారణం కేవలం పోలవరమే. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. ఇక పోలవరంతో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలు పోలవరం బ్యాక్ వాటర్‌తో నీట మునగనున్న విషయం సాంకేతికంగా స్పష్టమైంది. దీంతో ముంపు మండలాలను విభజిత ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసేశారు. అప్పటివరకు తెలంగాణ భూభాగంలోని ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి ఈ నాలుగు మండలాలు తూర్పుగోదావరి జిల్లాలోకి విలీనమయ్యాయి. తదుపరి రాష్ట్రంలో చోటుచేసుకున్న పునర్విభజన నేపథ్యంలో విలీన ప్రజలు ఖమ్మం నుంచి తాజాగా పోలవరం జిల్లా వరకు పేరు, ఊరు, ఇల్లు మారకపోయినా జిల్లాలు మారుతూ వస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, పోలవరం జిల్లాగా ఏర్పాటు చేసేందుకు జీవో నం, 1492తో కూడిన నోటిఫికేషన్ విడుదల చేయడం చకచకా జరిగాయి. దీంతో రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, గుర్తేడు, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవమ్మంగి, చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలతో కూడిన పోలవరం జిల్లా ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. కాగా 30 రోజులు వ్యవధిలో ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలు, మార్పులతో కూడిన లేఖలను జిల్లా కలెక్టర్‌కు ఇవ్వవచ్చని ప్రభుత్వం గడువు ఇచ్చినప్పటికీ పోలవరం జిల్లా ఏర్పాటు ఏకగ్రీవమే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీ నాయకుల నుంచి వివిధ పార్టీల నేతల వరకు పోలవరం జిల్లా ఏర్పాటు నిర్ణయంతో ఏకీభవించడం దీంతో నూతన జిల్లాగా పోలవరం ఏర్పాటు ఇక లాంఛనమే. కాగా జిల్లాల మార్పు జరిగిన ప్రతిసారీ సాంకేతిక సమస్య వచ్చిపడుతోంది. దీంతో ప్రజలు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలను తొలగించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి ఉంది.



సత్యదేవుని దర్శనానంతరం ఉప కులపతి చంద్రశేఖర్ కుటుంబీకులు



ఏఈవో శ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న సత్యశ్రావ్య

సత్యదేవుని సన్నిధిలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి శుక్రవారం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ విచ్చేశారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి చెన్నైయ్‌కు చెందిన రా వూరి శ్రీసాయి సత్య శ్రావ్య రూ.1,01,116 విరాళం సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఈ మొత్తాన్ని ఏఈవో శ్రీనివాస్, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్‌లకు అందజేశారు. దాతను వారు అభినందించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.

సివిల్స్ పరీక్షలకు విజయవాడలో ఉచిత శిక్షణ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్ పరీక్షలకు విజయవాడలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారిణి ఎం.లల్లీ తెలిపారు. శుక్రవారం ఆమె ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీలోపు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయం, ప్రగతి భవనం, రెండో అంతస్తు, డీఆర్డీఏ కాంప్లెక్స్, కాకినాడలో దరఖాస్తు చేయాలన్నారు. వారికి డిసెంబరు 7న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. బీసీలను 66శాతం, ఎస్సీలను 20 శాతం, ఎస్టీలను 14శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను కాకినాడలో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 0884-2379216, 8008121321 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బీసీలకు ఎరుకుల కులంగా ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు

జారీ చేస్తున్న అధికారులపై కేసులు పెట్టాలి: ఎరుకుల సామాజికవర్గీయుల డిమాండ్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ సామాజికవర్గీయులను ఎరుకుల కులంగా పేర్కొంటూ తమ కులస్తులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల ప్రజా సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం లయన్స్ కల్యాణ మండపంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల జాతి ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ సదస్సు శుక్రవారం జరిగింది. తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మానుపాటి రామకృష్ణ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు సంగడాల వెంకటరమణ, కోనసీమ జిల్లా అధ్యక్షుడు మానుపాటి గోవిందు మాట్లాడుతూ ఎరుకుల సామాజికవర్గానికి అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సామాజికవర్గానికి చెందిన వారికి ఎరుకుల కులంగా ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటుచేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సదస్సులో ఎరుకుల సామాజికవర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మూడు జిల్లాల అధ్యక్షులు

ఆనందంలో ఆయిల్‌పామ్ రైతు

- టన్ను రూ.19,660
- ధర నిలకడగా ఉండడంతో సాగుపై ఆసక్తి చూపిస్తున్న రైతులు
- జిల్లాలో 49,710 ఎకరాల్లో సాగు
- అత్యధికంగా గండేపల్లి మండలంలో 14 వేల ఎకరాలు



మల్లేపల్లిలో సాగు చేస్తున్న పామాయిల్ తోట



గండేపల్లిలో లారీలో లోడు చేస్తున్న పామాయిల్ గెలలు

గండేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయిల్‌పామ్ ధర అంచలంచెలుగా పెరుగుతూ ప్రస్తుతం టన్ను రూ.19,660 పలకడంతో పాటు ధర కూడా నిలకడగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ధర నిలకడగాలేక సుమారు రూ.25 వేలకు టన్ను ధర పెంచేసి మళ్లీ రూ.12 వేలకు చేసేయడంతో అప్పట్లో కౌలుకు తీసుకున్న రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. ఆ సమయంలో పామాయిల్ రైతులు కుదేలయ్యారు. పలుచోట్ల తోటలు సైతం తొలగించిన దాఖలాలు ఉన్నాయి. నిరాశగా ఉన్న రైతుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊపిరిపీల్చుకున్నట్లయ్యింది. పామాయిల్ ఎకరానికి ఎనిమిది నుంచి తొమ్మిది టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెపుతున్నారు. ఎకరానికి సుమారు రూ.30వేలు ఖర్చవుతుందని, సొంత రైతులకు ఎకరానికి లక్ష మిగిలితే కౌలు రైతులకు సుమారు రూ.70 వేలు లాభాలు వస్తున్నాయంటున్నారు. దీంతో మళ్లీ పామాయిల్ తోటలు వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో సుమారు 49,710 ఎకరాల్లో రైతులు ఈ పంట సాగుచేస్తుంటే ఒక్క గండేపల్లి మండలంలోనే సుమారు 14వేల ఎకరాల్లో రైతులు ఈ పంటను పండిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధర నిలకడగా ఉండి ఇంకా పెరిగే అవకాశముండడంతో జిల్లాలో 9 వేల ఎకరాల్లో కొత్తగా సాగుచేపట్టారు. అందులో గండేపల్లి మండలంలో అత్యధికంగా రెండు వేల ఎకరాల్లో ఈ సాగును పెంచారని అధికారులు చెపుతున్నారు. అయితే దీంతో పాటు సాగుచేసేందుకు ప్రభుత్వం కూడా రైతులకు రాయితీల రూపంలో చేయూతనివ్వడంతో రైతులు పంటలు చేసేందుకు మరింత ఆసక్తి చూపుతున్నా రు. మొక్కలు నిమిత్తం ఎకరానికి రూ.11వేలు, ఎరువులకు నాలుగు సంవత్సరాలకు రూ.8400, మొక్కతోటలో అంతర పంటలు పండించేందుకు నాలుగు సంవత్సరాలకు రూ. 8400 ప్రభుత్వం అందించడంతో చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై డ్రిప్ లైన్ ప్రభుత్వం అందిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయిల్‌పామ్ రైతులకు ఊపిరిపోసినట్లయిందని గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న నష్టాల నుంచి బయడపడుతున్నామని రైతులు చెబుతున్నారు.

ఇప్పుడిప్పుడే నష్టాల నుంచి కోలుకుంటున్నాం



గత ప్రభుత్వంలో టన్నుకు రూ.25 వేలు పెంచడంతో అధిక మొత్తంలో కౌలుకు తీసుకున్నారు. ఒక్కసారిగా మళ్లీ ధర తగ్గించేయడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాను. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధర పెంచడంతో పాటు నష్టాల నుంచి బయటపడుతున్నాం. ధర ఇలాగే ఉంటే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వ రాయితీలు బాగున్నాయి.

- రైతు పిల్లా సత్తిబాబు, మల్లేపల్లి

131 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు యువకుల అరెస్ట్
- వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు



నిందితుల్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న నల్లజర్ల పోలీసులు

నల్లజర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేడీపేట సమీపంలోని కాకరపాడు ఏజెన్సీ ఏరియా నుంచి 131 కిలోల గంజాయి తీసుకుని వస్తున్న ఇద్దరి యువకులను శుక్రవారం పట్టుకుని అరెస్ట్ చేసినట్టు నల్లజర్ల సీఐ రాంబాబు పేర్కొన్నారు. వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల వచ్చే మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఏపీ 31టీఏ 5142 నెంబరు గల బొలెరో వాహనంలో ప్లాస్టిక్ సంచుల్లో తరలిస్తున్నట్టు గుర్తించారు. అలాగే వాహనంతో పాటు సత్యసాయి పుట్టపర్తి జిల్లా గోరంట్ల మండలం మంగాలపల్లికి చెందిన తలారి ఆనంద్, మరో వ్యక్తి అదే జిల్లాకు చెందిన పూల మనోహర్‌ను అరెస్ట్ చేశారు. వీరిలో మనోహర్‌పై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్టు పోలీసులు తెలిపారు. ముఠాను ఎస్సై దుర్గాప్రసాద్, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారని, వారిని ఎస్పీ నరసింహ కిషోర్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ అభినందించారు.

చైన్ స్నాచర్‌కు ఆరు నెలల జైలు శిక్ష ఖరారు

కాకినాడ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా నడిచి వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసు తెంపిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మొదటి అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.సాహితి శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ గాంధీనగర్ చీడీలపొర వద్ద అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ 2021 డిసెంబరు 23వ తేదీ రాత్రి 7 గంటల ప్రాంతంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి నడిచి వస్తున్న క్రమంలో స్థానిక సూర్యనారాయణపురానికి చెందిన కర్నేని దుర్గాసాయి బైక్‌పై వేగంగా వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. అనంతరం ఆమె స్థానికుల సహాయంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీసీఎస్ ఎస్సై టి.క్రాంతికుమార్ దర్యాప్తు చేపట్టి నిందితుడు దుర్గాసాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కోర్టులో జరిగిన వాదోపవాదనల్లో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో మెజిస్ట్రేట్ పై విధంగా తీర్పు చెప్పారు. ప్రస్తుత సీఐ మజ్జి అప్పల నాయుడు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ ఎస్. లోవరాజు సాక్ష్యులను ఏ ప్రలోభాలకు లొంగకుండా ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టి నందుకు ఎస్పీ జి. బిందుమాధవ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పి. రఘువీర్ వాదనలు వినిపించారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్రచికత్స చేయించుకున్న వ్యక్తితో వైద్యబృందం

సామర్లకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్స చేసింది. అత్యంత అరుదుగా కనిపించే డెవలప్‌మెంటల్ డిస్ప్లేసియా ఆఫ్ ది హిప్ రకమైన తుంటి సమస్యకు అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో రోగి పరిస్థితిని వేగంగా విశ్లేషించి తుంటి మార్పిడి శస్త్రచికత్సను విజయవంతంగా పూర్తిచేసినట్టు వైద్యబృందం వెల్లడించింది. శుక్రవారం సామర్లకోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ సుదర్శనరెడ్డి, డాక్టర్ మాధవరావు, డాక్టర్ కిషోర్ బాబు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రాంతానికి చెందిన 45 సంవత్సరాల వయస్సు గల ఏ.సత్యనారాయణ ప్రమాదవశాత్తు పడిపోవడంతో తుంటి ఎముకకు గాయమయ్యింది. దీంతో నడవలేని స్థితిలో ఆసుపత్రికి రావడం జరిగిందన్నారు. సదరు వ్యక్తికి అన్ని ప్రాథమిక వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం గాయంతో పాటు తుంటి ఎముకు పుట్టుకతోనే డెవలప్‌మెంటల్ డిస్ప్లేసియా ఆఫ్ ది హిప్ పేరిట తుంటి ఎముకలో సమస్య ఉన్నట్టు కూడా గుర్తించామన్నారు. వెంటనే అనస్తీషియా వైద్యులు కిషోర్‌బాబు , డాక్టర్ అరవింద్ నేతృత్వంలో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించామన్నారు. శస్త్రచికిత్స నిర్వహించిన 24 గంటల్లో సత్యనారాయణ తనే స్వయంగా లేచి నిలబడగలగడంతో శస్త్రచికత్స విజయవంతమైనట్టు తెలిపారు. తనకు ఈ శస్త్రచికిత్స నిర్వహించడంలో మెడికవర్ వైద్య బృందం చేసిన కృషికి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ ఈ తుంటి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం కావడంతో హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్యసేవల స్థాయిని, నిపుణులతో కూడిన మల్టీస్పెషాలిటీ కేర్ సేవల స్థాయిని మరోసారి ప్రతిబింబించిందన్నారు.

బీఎస్సీ నర్సింగ్ కౌన్సెలింగ్‌కు నేడు తుది గడువు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ మూడో దశ కౌన్సెలింగ్ గడువు శనివారంతో ముగియనుంది. ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఆరు నుంచి 29 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే వెబ్ ఆప్షన్‌లకు అవకాశం ఇచ్చారు. తొలి రెండు దశల్లో తేదీలపై స్పష్టత లేక అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేక అవకాశాలు చేజార్చుకున్నారు. ఈ నేపథ్యంలో 3వ దశ కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది జూలై 27న నిర్వహించిన ఏపీఎన్ సెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణులైనవారు అర్హులు. సీట్లు భారీగా మిగిలిపోవడం వల్ల కటాఫ్ మార్కులను 17కు తగ్గిస్తూ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నిర్ణయం తీసుకుంది. అధికారుల తీరు విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తోంది. కీలక తేదీల ప్రకటన వేళ, మార్పుల వేళ ఎటువంటి క్షేత్రస్థాయి సమాచారం ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మేడపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

- సామర్లకోట మెడికవర్ ఆసుపత్రికి తరలింపు

సామర్లకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గల ఏఏవో కార్యాలయం మేడపై నుంచి ప్రమాదవశాత్తు సుమారు 50 సంవత్సరాల వయసు గల స్వీపర్ జారిపడి తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళితే... రాజమహేంద్రవరానికి చెందిన ఈమె ఇటీవల కారుణ్య నియామకాలలో ఏఏవో కార్యాలయంలో స్వీపరుగా చేరింది. తీవ్రంగా గాయపడిన ఈమెను ఏడీబీ రోడ్డులో గల మెడికవర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రమాద పరిస్థితులు లేవని, కోలుకునేందుకు కొద్దిరోజులు పడుతుందని వైద్యులు పేర్కొన్నట్టు సహచర ఉద్యోగులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్

పోటీల్లో రిత్వికకు రజత పతకం



రుత్వికను అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా

అమలాపురం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేడిచర్ల రిత్విక తృతీయస్థానం సాధించి రజత పతకం దక్కించుకుంది. ఈసందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్‌సలీంబాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిత్వికను పలువురు అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు, ఎస్ఎంసీ చైర్మన్ మలిశెట్టి వీరాస్వామి, ఉపాధ్యాయులు బీఎన్ వెంకటేశ్వరరావు, రాయుడు శ్రీనివాసరావు, కేఆర్ఎన్ ప్రసాద్, ఎం.చంద్రమోహన్‌లతో పాటు బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ క్రికెట్ టోర్నమెంట్

కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు



బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జడ్జి ఆనందిని

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభమైంది. కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి జి.ఆనందిని క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఏడు పురుషుల జట్లు, రెండు మహిళల జట్లు పోటీలో నిలబడగా తొలి రోజు దివ్య వర్సెస్ దుర్గ జట్లు తలపడగా దివ్య జట్టు విజయం సాధించింది.పురుషుల జట్టు నుంచి వైఎస్ఎం,సునీల్‌కాంత్ జట్లు పోటీల్లో తలపడగా వైఎస్ఎం జట్టు విజయం సాధించింది.మోహన మురళి, ఆర్‌వీఎస్ జట్లు తలపడగా మోహనమురళి జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా జడ్జి ఆనందిని మాట్లాడుతూ కాకినాడ బార్ అసోసియేషన్‌లో తొలిసారిగా న్యాయమూర్తులు న్యాయవాదులు కలిసి ఆడ డం శుభపరిణామమన్నారు. ప్రస్తుతం మహిళలు క్రికెట్‌లో వరల్డ్ కప్ సాధించారని అలాగే కాకినాడ బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు కూడా క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు. కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి క్రికెట్ ఆడడం కాకినాడ బార్ అసోసియేషన్‌తో ప్రారంభమైందన్నారు. మూడు రోజులు పాటు సాగే ఈ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం ముగుస్తాయి. కార్యక్రమంలో జనరల్ కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు(చంటి), స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నక్కా వెంకటేష్, బార్ స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ జోకా విజయ్‌కుమార్, ఇతర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



మ్యాచ్ ఆడుతున్న న్యాయవాదులు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- కాకినాడ డీఈవో రమేష్
- నెలాఖరు వరకు జిమ్నాస్టిక్ పోటీలు
- 10 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరు



పోటీలను ప్రారంభిస్తున్న కాకినాడ డీఈవో రమేష్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కాకినాడ జిల్లా విద్యా శాఖ అధికారి పి.రమేష్ తెలిపారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అంతర్ జిల్లా జిమ్నాస్టిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. డీవైఈవో సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రస్థాయి మీట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 30 వరకు జరిగే పోటీలకు 10 జిల్లాల నుంచి 400మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ఐ అడ్మిన్ కార్యదర్శి సుధారాణి తెలిపారు. డీఎస్‌డీవో సతీష్‌కుమార్ మాట్లాడుతూ కాకినాడలో జాతీయస్థాయి ప్రమాణాల జిమ్నాస్టిక్ స్టేడియం ఉందని వచ్చే ఏడాది జాతీయ పోటీలను కాకినాడకు కేటాయించేలా చూడాలని కోరారు. డీఈవో రమేష్ జాతీయ జెండా, డీఎస్‌డీవో ఎస్‌జీఎఫ్ఐ జెండాలను ఆవిష్కరించారు. క్రీడాకారుల కవాతును స్వీకరించిన అనంతరం బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. సెయింటాన్స్ పాఠశాల విద్యార్థుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ సంఘ అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు,ఎల్.జార్జి, రవిరాజు, పీడీలు ప్రసాద్, హరిబాబు, సూరిబాబు, కోచ్ సురేష్, ఎంపిక కమిటీ సభ్యుడు శరత్‌చంద్ర,క్రీడాకారిణి యాసిన్, వివిధ జిల్లాల కోచ్‌లు పాల్గొన్నారు.



జిమ్నాస్టిక్ ప్రదర్శన ఇస్తున్న క్రీడాకారుడు



సెయింటన్స్ స్కూల్ విద్యార్థినుల యోగాసనం

తూర్పుకాపులకు ఓబీసీ సర్టిఫికెట్ల మంజూరుకు కృషి

తూర్పుకాపు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని తూర్పుకాపు విద్యార్థులకు ఓబీసీ సర్టిఫికెట్ల కోసం పడుతున్న ఇబ్బందులు తొలగించి వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర తూర్పు కాపు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి హామీ ఇచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆమె రాజమహేంద్రవరం వచ్చారు. ఈ సందర్భంగా రౌతు తాతాలు కళ్యాణమండపంలో సంఘం కార్యదర్శి మజ్జి రాంబాబు అధ్య క్షతన జరిగిన సమావేశంలో యశ్వని మాట్లాడుతూ జిల్లాలో తూర్పు కాపు విద్యార్థులను చిన్నచూపు చూస్తు న్న సంఘటనలు తనకు బాధ కలిగిస్తున్నాయని వారికి ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించడానికి అవరసమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓబీసీ సర్టిఫికెట్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ను సత్కరించారు. కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పతివాడ రామరాజు, లంక సత్యనారాయణ, యజరపు మరిడియ్య, ఆర్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. ఎంత పెద్ద తాచుపామో!



అమలాపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బండారులంకలో శుక్రవారం గోరు లావణ్యవతి ఇంట్లోని ఫ్రిజ్‌లోకి తాచుపాము దూరింది. తెలియక తలుపు తీయగానే ఆ పాము బుసలు కొట్టింది. దాంతో ఇంట్లోని వ్యక్తులంతా భయభ్రాంతులకు గురై వెంటనే స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం అందించగా అరగంట సేపు శ్రమించి చాకచక్యంగా ఆ పామును బంధించి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు.

జాతీయ జంబోరీలో

రాజమండ్రి రైల్వే స్కౌట్స్



జంబోరీలో పాల్గొన్న రాజమండ్రి రైల్వే స్కౌట్స్

రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లక్నోలో జరుగుతున్న జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరీలో రాజమండ్రి రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.జంబోరీని 23న ప్రధాని మోదీ ప్రారంభించగా.. 29న(నేడు) ముగింపు కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు కానున్నారు. జాతీయ జంబోరీలో పాల్గొనడం ప్రతిష్టాత్మకంగా స్కౌట్స్ భావిస్తారు. దీనిలో పాల్గొన్న వాళ్లకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషను వర్తిస్తుంది. రాజమండ్రి నుంచి కె.రేషిత,ఏ.హర్ష,వి.సాత్విక, పీబీవీఎస్ కళ్యాణ్, ఎం.చందన్ శివసాయి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురికి జైలు

రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లోని నిందితులకు కోర్టు జైలు శిక్ష, జరిమానాలు విధించింది. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 12 మందిని పోలీసులు కోర్టులో హాజరు పరి చారు. ఏడుగురికి రూ.10వేల చొప్పున, ఒకరికి ఒక రోజు, ఇద్దరికి రెండు రోజులు, మరో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేటు సి.రమ్య ఉత్తర్వులిచ్చారు.

రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీల విజేత తూర్పు



విజేతగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టు

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచినట్టు టీమ్‌కోచ్, మేనేజర్ ఐ.భీమేష్ తెలిపారు. విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలలో అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అనంతపురం జిల్లా జట్టుతో జరిగిన ఫైనల్ ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టు అద్భుత ప్రతిభ చాటి ప్రథమస్థానం సాధించింది. ఈ జట్టుకు రామచంద్రపురానికి చెందిన తేజస్వరూప్ కెప్టెన్‌గా వ్యవహరించారు.అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. ఫైనల్స్‌లో కృష్ణా జిల్లా జట్టు తో తలపడి రన్నరప్ సాధించింది. ఈ జట్టుకు అంబాజీపేటకు చెందిన మౌనిక కెప్టెన్‌గా వ్యవహరించింది. ఉమ్మడి జిల్లా జట్లు కోచ్, మేనేజర్లు సునీత, ఎస్వీవీ సత్యనారాయణ, బీటీ త్రినాథవర్మ, వి.నరసింహారావు, ఐ.భీమేష్ వ్యవహరించారు.

రాష్ట్ర గట్కా పోటీలకు పందలపాక విద్యార్థినులు



రాష్ట్ర గట్కా పోటీలకు ఎంపికైన పందలపాక విద్యార్థినులు

బిక్కవోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి గట్కా పోటీలకు ఆరుగురు విద్యార్థినిలు ఎంపికైనట్టు హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపికైన వారిలో అండర్-17 నుంచి ఇమ్మంది సత్యహరిణి, కొమ్ము జాహ్నవి, నూలు అపర్ణ, భవ్యశ్రీ అండర్-19 నుంచి గొలుగూరి శ్రావ్యరెడ్డి, దేవాది అలేఖ్య వున్నారు. వీరు ఈ నెల 29 నుంచి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, తీర్చిదిద్దిన పీడీ యువరాజారెడ్డి, భీమేశ్వర్‌రెడ్డిను హెచ్ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ పంపన వీరసత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్వేది నరసన్న హుండీ ఆదాయం

రూ.47,48,861



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అంతర్వేది, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 78 రోజులకుగాను ఈ హుండీ ఆదాయాలను జిల్లా డీసీ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో అమలాపురం తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించినట్టు ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. స్వామివారి ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.46,61,265, గుర్రాలక్కమ్మ ఆలయ హుండీ ద్వారా రూ.19,774, అన్నదాన హుండీ ద్వారా రూ.67,823 మొత్తం హుండీల ఆదాయం రూ.47,48,861 వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 2గ్రాముల బంగారం, 23గ్రాముల వెండి వస్తువులు, పలు దేశాల కరెన్సీ నోట్లు లభ్యమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, భక్తులు, విశ్వహిందూపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా చినబాబు



పిఠాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన కొమ్ము చినబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు జారీ చేసిన ఆదేశాలు శుక్రవారం అందాయి. ఎమ్మార్పీఎస్ అభివృద్ధికి కృషి చేస్తానని చినబాబు చెప్పారు.



గొల్లప్రోలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ అభినందన

గొల్లప్రోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన దక్షిణ భారత సైన్స్ డ్రామా రాష్ట్ర స్థాయి పోటీల్లో గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నాలుగో స్థానంలో నిలిచారు. స్టేట్ బెస్ట్ మేల్ యాక్టర్‌గా 8వ తరగతి విద్యార్థి సూర్యకిరణ్ ఎంపికయ్యాడు. విద్యార్థులను, గైడ్ టీచర్ అయిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు భారతి, హెచ్‌ఎం రాజ్యలక్ష్మిలను కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో పిల్లి రమేష్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసవినీల్ పాల్గొన్నారు.





జీజీహెచ్ కూడలిలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ, సీపీఐ నాయకులు



పేదలకు వస్త్ర దానం చేస్తున్న పెరిక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బద్రి

జ్యోతిరావు పూలేకు నివాళి

కాకినాడ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశాల మేరకు శుక్రవారం జీజీహెచ్ కూడలిలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద 135వ వర్ధంతి నిర్వహించారు. పూలే విగ్రహానికి టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, పప్పు దుర్గారమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్నికుల కార్పొరేషన్ డైరెక్టర్ పంతాడి రాజు, 36వ డివి జన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, నాయకులు చింతా పేర్రాజు, పినపోతు రాము, చొక్కా గిరి, మల్లాడి రాజు, మన్నె నాగేశ్వరరావు, కోనాడ ప్రకాష్, మల్లాడి గంగాధరం, వాసుపల్లి మల్లి, మచ్చా రాజు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ కూడలిలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, ఎ.భవాని, పలు సంఘాల నాయకులు నాని, గంగ, నక్క శ్రీనివాసరావు, సత్రబోయన రామారావు పాల్గొన్నారు.

93 బీసీ కులాల ఐక్య వేదిక, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో గరల్స్ పోలిటెక్నిక్ కళాశాల వద్ద పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన సేఫ్ ఎమర్జెన్సీ హాస్పటల్ ఎండీ డాక్టర్ ఆనంద్, పెరిక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వనపర్తి బద్రి.... పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ జేఏసీ చైర్మన్ చొల్లంగి వేణుగోపాల్, నాయకులు కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్, యనమదల రవి, రాయుడు నాగేశ్వరరావు, కర్రి గోపాలకృష్ణ, ఏవీడీ మెంటారావు, ఆవుపాటి ఉమాశంకర్, వాసంశెట్టి రాజేశ్వరరావు, పొన్నగంటి సత్యనారాయణ, గుమ్మళ్ల చిన్న ప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావు



కేవీవీ సత్యనారాయణ

యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక

సామర్లకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ సామర్లకోట పట్టణ శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలను శుక్రవారం సాయంత్రం ఎన్టీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవీ సాయిరాం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఎం.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కేవీవీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా జి.గోవిందు, ఉపాధ్యక్షుడిగా డి.వీరన్న, మహిళా ఉపాధ్యక్షురాలిగా సీహెచ్ లక్ష్మీదుర్గ, కోశాధికారిగా ఎస్.రాజా, కార్యదర్శులుగా డి.సూర్యనారాయణ, వైగురు ప్రకాష్‌రావు, కె.రామకృష్ణ, సీహెచ్ కనకదుర్గ, పి.కాశీవిశ్వనాథం, జి.బేబీరాణి, బీఆర్ఎస్ శివ కుమార్, ఆడిట్ కమిటీలో జి.శంకర్, జిల్లా కౌన్సిలర్లుగా కేఎస్ఎస్ అప్పాజీ గుప్తా, ఎం.రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి ఎస్.వీరబాబు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్ పి.గిరిధరగోపాలరావు అభినందించారు.





పెద్దాపురంలో అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, సామర్లకోట మండలం కొప్పవరంలో ఎంపీ సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ

పెద్దాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులను పరిశీలించి విచారణ అనంతరం పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులో కొప్పవరంలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 32వ ప్రజాదర్బార్ నిర్వహించారు. పలు సమస్యలపై 28 అర్జీలు నమోదయ్యాయని ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. 9 అర్జీలను ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. మిగిలిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించామన్నారు. జున్నూరు బాబ్జీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, చింతపల్లి అర్జున్, హరి, ముత్యాల అనిల్, కొండబాబు, పాలిక సతీష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





కరప మండలం అరట్లకట్ట, కాకినాడ రూరల్ మండలంలో రైతులకు కరపత్రాలు అందజేస్తున్న కూటమి పార్టీల నాయకులు

‘రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట’

కరప, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు శుక్రవారం అరట్లకట్ట, గొడ్డటిపాలెం గ్రామాల్లో రైతన్నా... మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రైతులను కలిసి కరపత్రాలను అందజేసి వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కూటమి ప్రభు త్వం చేపట్టిన పంచసూత్రాలను వివరించారు. మండల వ్యవసాయాధికారి ఇమ్మిడిశెట్టి సత్య, సొసైటీ చైర్మన్ గంటా వీరన్నచౌదరి, నాయకులు బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, బత్తుల సతీష్, ముత్యాలరావు, గోన ఆంజనేయులు, పుల్లయ్యప్రసాద్ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం పండూరు, నేమాం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతన్నా... మీకోసం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావు రైతులను కలిసి వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బూరిగ ఆశీర్వాదం, కూటమి నాయకులు చిలుకూరి రామ్‌కుమార్, బి.రామకృష్ణ, బి.కామేశ్వరరావు, డి.నూకరాజు, ఇ.సుబ్బారాయుడు, ఎన్.సత్తిబాబు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

గొల్లప్రోలు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలకు చెందిన ఆరుగురికి ఆరోగ్య అవసరాల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3.24 లక్షలు మంజూరయ్యాయి. చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ అందజేశారు. జనసేన నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, రెడ్డెం జనార్దన్, బాలిపల్లి రాంబాబు, బొజ్జా రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో మెగా దంత వైద్య శిబిరం



మెగా దంత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

పిఠాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దంత సమస్యలున్న వారందరికీ ఉచితంగా చికిత్స చేయడం అభినందనీయమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని రెడ్డిరాజా కల్యాణ మండపంలో మూడు రోజులు నిర్వహించనున్న మెగా దంత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. నియోజకవర్గవ్యాప్తంగా మూడు నెలలు ప్రాథమిక స్క్రీనింగ్ నిర్వహించి 24వేల మందికి దంత సంబంధిత సమస్యలున్నట్టు గుర్తించారన్నారు. శిబిర నిర్వాహకురాలు నియో విద్యా సంస్థలు, ట్రస్టు డైరెక్టర్ డాక్టర్ బుర్రా దివ్యరాజ్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ పుట్టినరోజున కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామాల్లో ప్రాథమిక పరీక్షలు పూర్తి చేశామన్నారు. అధునాతన వైద్య పరికరాలను ఇక్కడికే తీసుకొచ్చి చికిత్స చేస్తున్నామని చెప్పారు. డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ సందీప్, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : డీపీవో

కరప, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఉదయం ఆయన మండలంలోని అరట్లకట్టలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. తాగునీటికి క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయించాలని, ఇంటింటా తడి, పొడి చెత్తల సేకరణ సజావుగా చేపట్టాలని, ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. స్వమిత్వ సర్వే ప్రగతిపై చర్చించారు. డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు, కార్యదర్శి ఎడ్ల రాంజీహీరాలాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం ప్రమాణస్వీకారం

పిఠాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు శుక్రవారం ప్రమాణం చేశారు. పట్టణ శాఖ అధ్యక్షుడిగా వరదా సత్తిబాబు, ఉపాధ్యక్షుడిగా నొక్కుల రాజు, ప్రధాన కార్యదర్శిగా మందవరపు సంతోష్, కోశాధికారిగా వాంపోలు జయకృష్ణ, ఉప కార్యదర్శిగా ఎండీ బాషా బాధ్యతలు చేపట్టారు. వీరిని పలువురు నాయకులు, సంఘ ప్రతినిధులు అభినందించారు.

స్కూలు బ్యాగులు పంపిణీ

పిఠాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారంలో గల సీబీఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రముఖ ఫైనాన్స్ సంస్థ ఐఐఎఫ్ఎల్ స్కూలు బ్యాగులు సమకూర్చింది. శుక్రవారం వాటిని ఆ సంస్థ డీఎం రౌతు ప్రసన్నకుమార్ అందజేశారు. ఐఐఎఫ్ఎల్ బ్రాంచి మేనేజరు నక్కా నాగభూషణం, ఆశిష్, శంకర్, బాలరాజు, సామాజిక సేవా కార్యకర్త నల్లమిల్లి అర్జుణకుమార్, ఉపాధ్యాయులు రమణ, సతీష్, దుర్గాదేవి, అశ్వినిదేవి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై ప్రతిజ్ఞ

తాళ్లరేవు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండల సమాఖ్య కార్యాలయంలో నియచేతన 4.0 జాతీయ స్థాయి జెండర్ వివక్షతపై మండల సమాఖ్య సభ్యులు, ఎంఎస్‌ఓబీలు శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. సమాఖ్య అధ్యక్షతన జెండర్ వివక్షత వెబ్ కాస్ట్ జరిగింది. లింగ వివక్షతపై చర్చించి ర్యాలీలు నిర్వహించారు. బీమాబాయి మహిళా మండలి, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో కౌమార బాలలు ప్రదర్శనలు జరిపారు. సీడీపీవో శ్రీదేవి, ఐసీడీఎస్ సిబ్బంది, ఏపీవో, వీవోఏలు పాల్గొన్నారు.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం స్వర్ణ పుష్పార్చన జరిపారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

జీవిత లక్ష్యాల సాధనపై ‘ప్రేరణ’



విద్యార్థులకు ఇంగ్లీషు హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీసు పుస్తకాలు అందజేస్తున్న ప్రసాద్

పిఠాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ఏకేపీఎం మునిసిపల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులైన... విశ్రాంత ఉపాధ్యాయుడు, సీసీఆర్టీ రిసోర్స్‌పర్సన్ కేవీఎస్ఎస్ ప్రసాద్, విశ్రాంత సీఐ షేక్ గణేష్ వలీ, విశ్రాంత ఏఈ అల్లుబోయిన సత్యనారాయణ, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, న్యాయవాది తటవర్తి సురేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు గుబ్బల రాజు శుక్రవారం కలిశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు జీవిత లక్ష్యాలు, వాటిని సాధించడం ఎలా, చదువులో ఉత్తమ ఫలితాలు పొందడం, ఏయే రంగాల్లో ఉపాధి అవకాశాలున్నాయో వివరించారు. హ్యాండ్‌రైటింగ్ ఉచిత శిక్షణ ఇచ్చే సీసీఆర్టీ రిసోర్స్‌పర్సన్ ప్రసాద్ కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్టు ద్వారా హ్యాండ్‌రైటింగ్ ప్రాక్టీస్ పుస్తకాలను విద్యార్థులకు అందించారు. అందమైన చేతిరాత భవిష్యత్తును మార్చివేస్తుందన్నారు. హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు లోవరాజు, కృష్ణార్జున, సునీత తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం సీహెచ్‌సీకి రూ.9.50 కోట్లు కేటాయింపు

పిఠాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వంద పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయిన పిఠాపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి (ప్రభుత్వాసుపత్రి) తొలి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.9.50కోట్లు నిధులను విడుదల చేసింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఇందుకు అవసరమైన భవనాలు, అత్యాధునిక పరికరాలను సమకూర్చేందుకు రూ.38కోట్లను ప్రభుత్వం గతంలో కేటాయించింది. ఇందులో భాగంగా వంద పడకల ఆసుపత్రికి అవసరమైన భవనాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కేటాయించిన నిధుల నుంచి 25శాతం విడుదల చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆసుపత్రి భవనాల నిర్మాణం, పరికరాలు సమకూర్చడం తదితర పనులు వేగవంతం కానున్నాయి.

ప్రాణాంతక వ్యాధిగ్రస్థ చిన్నారులకు పోషకాహార కిట్లు పంపిణీ

కాకినాడ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోటరీ శాశ్వత ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో శుక్రవారం టూటౌన్ బ్రిడ్జి దిగువున గల రోటరీ చేయూత భవన్‌కు రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ వై.కళ్యాణ చక్రవర్తి విచ్చేశారు. ఆయన్ను చేయూత వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మొండి రవికుమార్, కార్యదర్శి ఆలీమ్, ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి ఘనంగా సత్కరించారు. ప్రాణాంతక వ్యాధిగ్రస్థ చిన్నారులకు చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్లాత్ బ్యాగ్‌లు, డిగ్రీ చదువుతున్న కాకినాడకు చెందిన పేద విద్యార్థి సూర్యచంద్రకు రూ.10వేలు చెక్కు అందజేశారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి, రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ గోపీనాథ్, కార్యదర్శి సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ్‌చక్రవర్తి, రోటరీ బ్లడ్ బ్యాంకు కార్యదర్శి మాచారెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి: ఎంపీడీవో శ్రీనివాస్

కరప, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన గ్రామాల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా అందరూ పని చేయాలని కరప ఎంపీడీవో జటావల్లభుల శ్రీనివాస్ సూచించారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ కమిషనరు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో యానిమేటర్లకు, స్వయం సహాయక సంఘాలకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎల్ఎస్‌డీజీ థీమ్-5 (క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్)పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించాలని, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ అనుకూల కార్యక్రమాల అమలులో భాగస్వాములు కావాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు, కొరుపల్లి పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పరిశీలన

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బాలాజీ చెరువు ప్రాంతం, 36వ సర్కిల్ పరిధిలోని 11వ డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ప్రజలు సూచించిన కాల్వ సమస్యను పరిశీలించిన ఆయన వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. వార్డులో తాగునీటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగన్నాథపురం ఏటిమొగలో వెహికల్ యార్డును తనిఖీ చేశారు. వాహనాల పర్యవేక్షణకు కొత్త సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసినట్టు తెలిపారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దర్మజీ, సిబ్బంది పాల్గొన్నారు.

‘నారాయణ’లో మాస్టర్ ఒరేటర్ గ్రాండ్ ఫైనల్స్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న తోట సుధీర్, వైడీ రామారావు

కాకినాడ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు మాస్టర్ ఒరేటర్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ అన్నారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో శుక్రవారం నారాయణ పాఠశాలల మాస్టర్ ఒరేటర్ సీజన్-6 గ్రాండ్ ఫైనల్స్ నిర్వహించారు. ఏజీఎం రాఘవేంద్రరావు అధ్యక్షత వహించగా గౌరవ అతిథులుగా హాజరైన తోట సుధీర్, రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు భయాన్ని వీడినప్పుడే సమాజం గర్వించే వక్తలుగా తయారవుతారన్నారు. వైడీ రామారావు మాట్లాడుతూ స్వామి వివేకానంద మంచి వక్త అని, ఆయన సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశారన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఆర్.దీవన్, వి.శోభ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు ఏజీఎం రాఘవేంద్రరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, వేదవతి, మూర్తి, కవిత, షర్మిల, రవికిషోర్, విఠల్, వీరభద్రరావు, డీజీఎం కృష్ణ, డీన్ చలపతి, షకీల్, రాధాకృష్ణ, ప్రవీణ్, పద్మలత, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం



రక్తదానం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

కాకినాడ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తిలక్ వీధిలో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో ఆంధ్రాబ్యాంక్ 103వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభిసీతారామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెగా రక్తదాన శిబిరాన్ని రీజనల్ హెడ్ బీజీఆర్ నాయుడు ప్రారంభించగా సిబ్బందితో పాటు పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, వ్యాపారవేత్త వీరరాఘవరెడ్డి, పురుషోత్తం, ఈవీ కృష్ణమాచార్యులు, సునీత పుష్టి, బ్యాంక్ యూనియన్ నాయకులు జేఎస్వీ శ్రీనివాస్, ఎ.సాంబశివరావు, పి. చంద్రశేఖర్, ఎ.శ్రీనివాసకుమార్, వీఎస్ఎన్ మూర్తి, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద నిలయంలో ఆకస్మిక తనిఖీలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని వసతిగృహాల స్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణను నోడల్ అధికారిగా నియమించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఇతర అధికారులతో కలిసి రంగరాయ మెడికల్ కాలేజీ ఎదురుగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆనంద నిలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం సమయానికి చేరుకున్న ఆయన విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, సౌకర్యాలను తెలుసుకున్నారు. వంటశాల, డైనింగ్ హాల్, మంచినీటి ఆర్వో ప్లాంటు, బాత్‌రూమ్‌లు, స్టోర్ రూం, ఆవరణ పరిశుభ్రతలను పరిశీలించారు. నగరంలోని 29 వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఇన్‌చార్జి కమిషరు చెప్పారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, డీఈ ఫణికుమార్, ఏఈ దుర్గా, శానిటేషన్ సూపర్‌వైజర్ నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ డ్రైవర్లకు ముగిసిన శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లకు 21వ బ్యాచ్ శిక్షణ శుక్రవారం పూర్తయింది. కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారికి సర్టిఫికెట్లు అందజేశారు. వచ్చే నెల 9న 22వ బ్యాచ్ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ కేడియం రాజును సత్కరించారు. ఇన్‌చార్జి ఆర్టీవో హరినాథరెడ్డి, డిపో మేనేజరు ఎంయావీ మనోహర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి పాల్గొన్నారు.



వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని తెప్పోత్సవం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలవెల్లి మల్లవరంలో స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తెప్పోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి హంస వాహనంపై ఉంచారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరులో స్వామి, అమ్మవార్లు విహరించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అంతకు ముందు స్వామికి మహా రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంపా ఆయకట్టు రెండో పంటకు నీరు

తొండంగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పంపా ఆయకట్టు భూముల రెండో పంటకు నీటి విడుదలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రబీ పంటకు నీరు విడుదల చేయాల్సిందిగా మంత్రి నిమ్మల రామానాయుడిని ఫోన్‌లో కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. మండలంలో 8వేల ఎకరాలకుగాను 0.80 టీఎంసీల నీరు విడుదల చేయాలని కోరగా మంత్రి వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. రెండో పంటకు నీరు విడుదలలో ఎమ్మెల్యే కృషిపట్ల రైతులు వ్యక్తం చేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్

ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

రాజవొమ్మంగి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అంతకు ముందు రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.69 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. రాజవొమ్మంగి గ్రామంలో శివాలయం కొండపైకి వేసిన రహదారిని, రుద్రభూమికి వేళ్లే దారిలో వేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు, ఏఐఏసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, సొసైటి చైర్మన్ ముప్పన కేశవ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, గణజాల తాతరావు పాల్గొన్నారు.

పోలవరం జిల్లాపై అభ్యంతరాల స్వీకరణ

సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్

రంపచోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు పోలవరం జిల్లా ఏర్పాటుపై ప్రాథమిక ప్రకటన విడుదల చేశారు. రంపచోడవరం డివిజన్‌లోని అడ్డతీగల, దేవీపట్నం, గంగవరం, గుర్తేడు, మారేడుమిల్లి, రంపచోడవరం,రాజవొమ్మంగి, వై.రామవరం,చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, ఎటపాక మండలాలు కలిపి పోలవరం జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు.నోటిఫికేషన్‌కు సంబంధించి ఆయా మండలాల ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తున్నామన్నారు. 30 రోజుల్లోగా అభ్యంతరాలుంటే తెలపాలని పేర్కొన్నారు.

సీపీఎం నాయకుడు కృష్ణారెడ్డి మృతి

వీఆర్‌పురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నేత వాళ్ళ కృష్ణారెడ్డి (60) అనారోగ్యంలో తుదిశ్వాస విడిచారు. మండలంలోని కొటారుకొమ్ము గ్రామానికి చెందిన ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు మండల సీపీఎం నాయకులు మృతదేహంపై పార్టీ జెండానుకప్పి నివాళులర్పించారు. జిల్లా నాయకుడు సున్నం రాజు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలపై, పోలవరం సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, మండల నాయకులు పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్, కారం సుందరయ్య, తోడం రాజు పాల్గొన్నారు.

కుంజా శ్రీనుపై అక్రమ కేసులు హేయం

ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల

రంపచోడవరం/అడ్డతీగల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీనుపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు ఖండించారు. ఈ నెల 24న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఐటీడీఏ పీవోకు క్వారీపై ఫిర్యాదు చేశారు. విచారణకు వచ్చిన మైనింగ్ అధికారులు, తహసీల్దార్ ఆదివాసీలను రెచ్చగొట్టి బాధితులపై, బాధితులకు అండగా నిలిచిన కుంజా శ్రీనుపై రెచ్చగొట్టి దాడిచేయించడం హేయమైన చర్యన్నారు. తప్పుడు కేసులు పెట్టించడం సరికాదన్నారు. నరసాపురం క్వారీ వల్ల నష్టపోతున్న బాధితులకు న్యాయం చేయాలని, క్వారీలో విచ్చలవిడి బాంబ్ బ్లాస్టింగ్‌లతో పర్యావరణ కాలుష్యం జరుగుతుందన్నారు. పథకం ప్రకారమే ఆదివాసీలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడిన క్వార్రీ నిర్వాహకులు, అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కుంజా శ్రీనుపై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే తొలగించకపోతే ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

జ్యోతిరావుఫూలేకు ఘన నివాళి

అడ్డతీగల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఏపీసీసీ కాంగ్రెస్ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావుఫూలే వర్ధంతి నిర్వహించారు. తొలుత పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావుఫూలే బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, గంగాభవాని, రత్నం, చిన్నారావు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు అనుబంధ పనులకు రూ.542 కోట్లు

రాజమహేంద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టుకు ఇరువైపులా రోడ్ల నిర్మాణానికి రూ. 542.85 కోట్లు కేటాయించారు. రాజధానిలో శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. ఇరిగేషన్ శాఖ ద్వారా కేటాయించిన ఈ నిధులతో పోలవరం గ్రామం నుంచి స్పిల్‌వే వరకూ అనుసంధాన రహదారులు నిర్మిస్తారు. తూర్పుగోదావరి జిల్లా వైపు ప్రాజెక్టు నుంచి ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) వద్దకు గ్యాప్-1ను కలుపుతూ రోడ్డ నిర్మాణం చేస్తారు. వీటికి రూ.217.55 కోట్లు కేటాయించారు. గండిపోచమ్మ గుడి, హెడ్ రెగ్యులేటర్, నావిగేషన్ టన్నెల్ చివర కెఎల్ బండ్‌కు కలిపే పనులు చేస్తారు. మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసి పాలిటీల పరిధిలో ఇళ్లను నిర్మించుకునే సమయంలో ఖాళీ స్థలాల పన్నులు 50 శాతం తగ్గించడానికి కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఉగాది నాటికి టిడ్కో ఇళ్లను కూడా అప్పగించాలని నిర్ణయించింది.

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రరంలోని ఆర్టీసీ జోనల్ ట్రైనింగ్ కాలేజీలో హైర్ బస్ డ్రైవర్లు, ఆన్ కాల్ డ్రైవర్లకు శుక్రవారం ప్రమాదరహిత డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీ వరకూ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లోని 16 డిపోల నుంచి మొత్తం 1014 మంది డ్రైవర్లకు శిక్షణ ఇస్తారన్నారు.తొలిరోజున మొత్తం 63 మంది డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

బలహీనవర్గాల కోసం పోరాడిన పూలే

● వర్ధంతి కార్యక్రమంలో నాయకుల నివాళి



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న కొత్త వెంకటేశ్వరరావు

జగ్గంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కూటమిరాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలపమెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక హైస్కూల్ వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

● విద్యతోనే సమాజ అభివృద్ధి చెందుతుందని మహాత్మా జ్యోతిరావు పూలే అని జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న పరివర్తన స్థలంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు,రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ పులిప్రసాద్, కురుమల్ల రాంబాబు, గంధం శ్రీను, ఝటఇఝ మండల అధ్యక్షులు బారుంగాల నాగబాబు, వంశీ పాల్గొన్నారు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న తుమ్మలపల్లి రమేష్

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): స్త్రీ విద్య, వెనుకబడిన తరగతుల కోసం అహర్నిశలూ పోరాడిన మహోన్నత వ్యక్తి జ్యోతిబా పూలే అని నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. కోనేటి పాఠశాల వద్ద కౌన్సిలర్ అలమండ చలమయ్య నేతృత్వంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ ధోళే కిశోర్, అలమండ దుర్గా ప్రసాద్, బూర్లు సత్తిబాబు, రౌతు గురవయ్య, ఉడతల రమణారావు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు ధర్నాలకోట శ్రీను తెలిపారు. పూలే వర్ధంతి సందర్భంగా ఏగులమ్మగుడి వద్ద ఉన్న పూలే విగ్రహానికి ఆయన శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కందిమళ్ళ శామ్యూల్, ఏనుగుపల్లి రాంబాబు, కాకర నాగేశ్వరరావు పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయం వద్ద పూలే చిత్రపటానికి బీజేపీ నాయకులు సింగిలిదేవ్ సత్తిజు, దేవర రామకృష్ణయాదవ్, కందా వీరస్వామి, మదినేబాబ్జి మూరా కృపారాయ్, తటవర్తి విజయ రామన్న దొర, ఎం. వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తశతి పారాయణలు, మూలమంత్రజపాలు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలు అర్పించి పూర్ణాహుతి గావించారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అన్నవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యదేవ హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీకళాశాల పూర్వవిద్యార్థులతో దేవస్థానం తరఫున సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలయ ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలోనిర్వహించనున్నారు. ప్రతి ఒక్క పూర్వవిద్యార్థి విచ్చేసి ఉన్నతస్థానానికి తీసుకెళ్లిన విద్యాపీఠాన్ని సందర్శించాలని కోరారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

జగ్గంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. మల్లిసాల గ్రామానికి చెందిన తోకల వెంకటేశులు రంపచోడవరం మండలం సోకులగూడేనికి చెందిన మహిళతో సహజీవనం చేసేవాడు. 2020లో కోడి మాంసం కూర వండలేదని ఆమెపై కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె ప్రాణాలు కోల్పోయింది. అప్పటినుంచి పరారీలో ఉన్న వెంకటేశులును పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపర్చి జైలుకు పంపారు. కోర్టులో ఛార్జిషీటును దాఖలు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

టీడీపీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి: ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. తోట వీధిలోని పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో మరింత శక్తివంతంగా ఉత్సాహంగా ప్రతి కార్యకర్త నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు, టీడీపీ నాయకులు దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం

● ఏలేశ్వరం కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ సత్యవతి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యవతి

ఏలేశ్వరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కుశరాజు అజెండాలోని అంశాలను చదవగా వార్డులో పైపులైన్ల మరమ్మతులు, సీసీ కల్వర్టు నిర్మాణం, శానిటేషన్ పనిముట్లు, పలు అంశాలను కౌన్సిలర్లు ఆమోదించారు. దుకాణాలపై అదనపు పన్ను భారాన్ని వచ్చేఏడాదికి వాయిదావేయాలని కౌన్సిలర్ చలమయ్య సూచించారు.

నాణ్యతలేని తహసీల్దార్ భవనం

● గోడలకు నెర్రలు, పెచ్చులూడుతున్న టైల్స్

గండేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నిర్మాణం చేపట్టి సుమారు ఐదేళ్లు గడవకముందే గండేపల్లి తహసీల్దార్ కార్యాలయ భవనం నెర్రలు తీసింది. నాణ్యతలేకుండా నిర్మించడంవల్లే భవనానికి అప్పుడే బీటలు వారాయి. గత ప్రభుత్వంలో పాత భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ భవనాన్ని తొలగించి సుమారు రూ.90లక్షల నిధులతో కొత్త భవనం నిర్మించారు. ఈ భవనం 2021లో అప్పటి నాయకుల అట్టహాసంగా ప్రారంభించారు. అయితే ప్రారంభించిన ఐదు సంవత్సరాలకే భవనం గోడలు నెర్రలు తీసి మెట్లకు వేసిన టైల్స్ అచ్చులుగా ఊడిపోతున్నాయి. దీంతో ఈభవనం ఎంత నాణ్యతతో నిర్మించారోనని పలువురు విమర్శిస్తున్నారు.



ఊడిపోయిన టైల్స్, బీటలు వారిన గండేపల్లి తహసీల్దార్ కార్యాలయం

'గిరిజనుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి'

రౌతులపూడి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. టికే రహదారి నుంచి దిగువ ధారపల్లికి రహదారి నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గిరిజనులు సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దిగువధారపల్లికి రహదారి లేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 2.5కిలోమీటర్లు 1.95.కోట్లుఖర్చుచేసి రహదారి నిర్మిస్తుందన్నారు. టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షు డు జ్యోతుల నవీన్, జనసేన నేత మేడిశెట్టి బాబీ, టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు మౌళి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరరావు, పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు, గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు.



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ,ఎమ్మెల్యే

ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తా

ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. దిగువధారపల్లిలో ప్రజాదర్బార్ శుక్రవారం నిర్వహించారు. ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. పింఛన్లు, రహదారులు, ఇళ్లస్థలాలు తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తనభర్త రాజా గిరిజనులకు విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించాలనేవారని, ఆయన ఆశయానికి అనుగుణంగా గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. తహశీల్దార్ ఎన్‌వీనరేష్, ఎంపీడీవో శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

మెరుగైన సమాజం కోసం యువతలో మార్పురావాలి

ఏయూ కళాశాల అభివృద్ధి మండలి డీన్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ టీవీ కృష్ణ

తుని రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం కోసం యువ తలో మార్పు రావాలని ఆంధ్ర విశ్వ విద్యాలయం కళాశాల అభివృద్ధి మండలి డీన్ ప్రొఫెసర్ టీవీ కృష్ణ తెలిపారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల (అటానమస్)ను ఆంధ్రా యూనివర్శిటీ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ప్రొఫెసర్ టీవీ కృష్ణ సందర్శించారు. అటానమస్ కళాశాల నూతన పరీక్షా విభాగాలను, సెంటర్‌ఫర్ ఎక్సలెన్స్ విభాగాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈకళాశాల యూనివర్శిటీ స్థాయిలో ఉందని, ఇక్కడ సదుపాయాలు, వనరులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎ. రామకృష్ణ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



శంఖవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి పంతంవారి మెట్టపై ఉన్న శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి, అమ్మవార్ల శ్రీపుష్పయాగ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేదపండితులు వేమకోటి త్రినాథశర్మ, ఆలయ అర్చకులు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అడబాల వీరబాబుదేవి, అడబాల వెంకటేశ్వరరావు ,అనంతలక్ష్మి చేతులమీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వివిధ రకాల సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించిన ఉయ్యాలపై స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి విఘ్నేశ్వర పూజ, అష్టోత్తర శతనామావలి, మంత్రపుష్పం వేద స్వస్తి వంటి కార్యక్రమాలు నిర్వమించారు. స్వామివారికి తొమ్మిది రకాల స్వీట్లు, వివిధ రకాల పండ్లతో పాటు చిలకలు, పాలు, కొబ్బరి బొండాలను సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గాబు గంగాధర్, వేణుమాధవస్వామి, కేలంగి నూకరాజు, త్రిమూర్తులు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేది కూటమి ప్రభుత్వమే : ఎమ్మెల్యే దివ్య



ఎస్అర్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

కోటనందూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులను ఆర్థికంగా ఆదుకున్నది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శుక్రవారం ఎస్అర్‌పేటలో పార్టీ మండల అధ్యక్షుడు పోతల సూరిబాబు అధ్యక్షతన రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, గాడి రాజుబాబు, మార్కెట్‌కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర సత్యనారాయణ, మాతిరెడ్డి భాస్కరరావు, గొర్లి అచ్చియ్యనాయుడు, వెలగా వెంకటకృష్ణారావు, మండల మహిళా అధ్యక్షురాలు సుర్ల సావిత్రి, పెనుముచ్చు నాగేశ్వరరావు గుడివాడ తాతబాబు, వ్యవసాయశాఖ ఏడీ కేజీ చంద్రశేఖర్, లగుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనువుగా లేని స్థలాలను రద్దు చేయాలి



ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే దివ్య

తొండంగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు అనువుగా లేనందున వాటిని రద్దు పరిచి అనువైన ప్రాంతంలో కేటాయించాలని పీఈ చిన్నయ్యపాలెం గ్రామస్తులు ఎమ్మెల్యే దివ్యకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆమె పీఈ చిన్నయ్యపాలెంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆత్మచైర్మన్ నరహరిశెట్టి ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రజలు తమసమస్యలు వినిపించారు. గతంలో 160మందికి ఇళ్లస్థలాలు కేటాయించారని, ఇప్పటివరకూ ఒక్క ఇంటి నిర్మాణం కూడా జరగనందున అనువైన ప్రాంతంలో కేటాయించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, వడ్డి రాంబాబు, ములికి రామకృష్ణ, రాంబాబు, అరిగెల నర్శింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

జగ్గంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్క రించడానికే కూటమి ప్రభుత్వం ప్రజాదర్బార్లు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. గోకవ రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. మొత్తం 720 వినతులు స్వీకరించారు.



విద్యార్థినికి ద్వితీయ స్థానం

ప్రత్తిపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో ప్రత్తిపాడు అఖిల్ పాఠశాల విద్యార్థినికి ద్వితీయస్థానం లభించింది. విశాఖపట్నంలో నిర్వహించిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అఖిల్ టాలెంట్ స్కూల్ విద్యార్థిని జి.యామినీలత ద్వితీయస్థానం సాధించిందని స్కూల్ కరస్పాండెంట్ ఇనకోటి గంగాధర్ తెలిపారు.



గండేపల్లి జాతీయరహదారిపై కిక్కిరిసిన ప్రయాణికులతో వెళుతున్న ఆటో

పరిమితికి మించి ప్రయాణం.. ప్రమాదం సుమా!

గండేపల్లి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఓవక్క జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నా.. కొందరు ఇంకా జాగ్రత పడడంలేదు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్న నిబంధనల ఉన్నా.. వారికి పట్టడంలేదు. ఇలాఆటోడోరు వెనుక సైతం కూర్చోబెడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ఉద్యమ ఆధార్ ఉచిత రిజిస్ట్రేషన్

గండేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా సమాఖ్య కేంద్రంలో మండలంలోని 90మంది చిరు మహిళా వ్యాపారస్తులకు శుక్రవారం ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఎం, నాన్‌పామ్ విజయలక్ష్మి, గండేపల్లి ఏపీఎం పి.సన్యాసిరావు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో అవగాహన కార్యక్రమం

గండేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఫార్మసీ విభాగం, ఏపిఫార్మా క్లబ్ సంయుక్తంగా 'భవిష్యత్తులో జంతు నమూనా లేకుండా ఔషధ ఆవిష్కరణ' అనే అంశంపై అవగాహన కార్యకమం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మలేషియా, క్వాలాలంపూర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మాలయా, ఫార్మసీ ఫ్యాకల్టీ, గ్రాడ్యుయేట్ రీసెర్చ్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ కనురి హాజరయ్యారు. ఔషధ రసాయనాల శోషణ, పంపిణీ, జీవక్రియ, విసర్జన, విషయ పరిశీలనలో కృత్రిమ మేధస్సు పాత్రను వివరించారు. అతిథులను ఆదిత్య యూనివర్సిటీ తరఫున ఫార్మసీ కళాశాల డీన్ డాక్టర్ డి.సతీష్ కుమార్ జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు.

ఉన్నత విద్యపై అవగాహన

గండేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థుల్లో ఉన్నత విద్యపై ఆసక్తి, అవగాహన పెంపొందించేందుకు ఆదిత్య యూనివర్సిటీలో ఉన్నత విద్యపై ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ దత్తత గ్రామమైన పి.నాయకంపల్లి నుంచి 10వ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.రామ్‌మోహన్ వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఐదుగురికి స్కూల్ బ్యాగులు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ శన్ముఖి, బి.రామ్‌సాగర్, డాక్టర్ టి.సుమన్‌రెడ్డి, డాక్టర్ ఆర్.అనిల్‌కుమార్, పి.శివకుమార్ పాల్గొన్నారు.

వీవోఏలకు శిక్షణ

తుని రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీవోఏలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఎంపీపీ బొప్పన రాము ప్రారంభించారు. క్లీన్ అండ్ గ్రీన్ థీమ్-5పై ఎంపీడీవో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.మరిడయ్య, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనుల పరిశీలన

తుని రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తునిలో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ చల్లకొండ సతీష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడులు 11మంది అరెస్ట్

ప్రత్తిపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినశంకర్లపూడిలో కోడి పందేల శిబిరంపై ప్రత్తిపాడు పోలీసులు దాడి చేశారు. 11మందిని అరెస్ట్ చేసి రూ.3400 స్వాధీనపరుచుకున్నారు. ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.